శివాలయాల వద్ద ఏర్పాట్ల జోరు

- నేటి నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు
- శివరాత్రి రోజున ప్రత్యేక వైదిక కార్యక్రమాలు

పెనుగొండ: మహాశివరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా జరిగే పుణ్యక్షేత్రాల్లో ఆచంట రామేశ్వరాలయం ఒకటి. వశిష్టా గోదావరి తీరానికి కొద్దిపాటి దూరంలో ఉండే ఆచంటకు స్థల పురాణం ఉంది. ముఖ్యంగా మహాశివరాత్రి పర్వదినాన స్వామి వారికి లింగోద్భవ కాలమందు ఏకాదశ రుద్రాభిషేకం చేస్తే పాపాలు హరిస్తాయని భక్తుల నమ్మకం. అదేవిధంగా ఆచంటేశ్వరుని ఆలయంలో కార్తీక పౌర్ణమికి అఖండ కర్పూర జ్యోతి వెలిగించడం ఆనవాయితీగా వస్తుంది. కార్తీక పౌర్ణమికి వెలిగించిన అఖండ జ్యోతి శివరాత్రి వరకూ వెలుగుతూనే ఉంటుంది. శివరాత్రి నేపథ్యంలో ఆచంటేశ్వరునికి సోమవారం నుంచి 28 వరకు ఉత్సవాలు కనుల పండువగా నిర్వహిస్తారు. ఇప్పటికే పెద్ద ఎత్తున ఆలయం వద్ద చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలతో తీర్చిదిద్దారు. 24న స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు, దేవస్థానం వారి ద్వారా పట్టువస్త్రాల సమర్పణ, 25 వేకువ జామున కల్యాణోత్సవం, 26న మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, స్వామివారి దర్శనం, మధ్యాహ్నం నుంచి భారీ రథోత్సవం, 27న స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు, గ్రామోత్సవం నిర్వహిస్తారు. 28న త్రిశూలోత్సవం, సాయంత్రం పుష్పయాగం నిర్వహిస్తారు. ఐదు రోజుల పాటు సాగే ఉత్సవాల్లో వచ్చే వేలాది మంది భక్తులకు ఆలయ సత్రం వద్ద అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నసమారాధన నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు.


ఆచంట రామేశ్వర స్వామి ఆలయం


విద్యుత్ దీపాల వెలుగుల్లో ఆచంట రామేశ్వర స్వామి ఆలయం ప్రాంతం

ఉత్సవాలకు ముస్తాబైన లక్ష్మణేశ్వరం శివాలయం

నరసాపురం రూరల్: తీర ప్రాంతంలో ప్రసిద్ధి చెందిన లక్ష్మణేశ్వరం గ్రామంలోని శ్రీ దుర్గా లక్ష్మణేశ్వరస్వామి ఆలయం మహాశివరాత్రికి ముస్తాబైంది. సోమవారం నుంచి ప్రారంభమయ్యే శివరాత్రి మహోత్సవాలకు సంబంధించి ఘనంగా ఏర్పాట్లు చేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. ఈ ఆలయంలో లక్ష్మణుడు శివలింగాన్ని ప్రతిష్ఠించడంతో ఈ గ్రామానికి లక్ష్మణేశ్వరం అనే పేరు వచ్చింది. బుధవారం జరిగే శివరాత్రి వేడుకలు, రథోత్సవాన్ని పురస్కరించుకుని భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఉండే విధంగా ప్రత్యే భద్రతా ఏర్పాట్లును చేస్తున్నారు. పోలీసులు ఇప్పటికే ఆలయానికి చేరుకుని క్యూలైన్లు, దర్శనం, అవుట్‌లెట్ తదితర సౌకర్యాలతోపాటు రథోత్సవం జరిగే ప్రాంతాలను పర్యవేక్షించారు. ఆలయ సిబ్బంది, మాజీ కమిటీ సభ్యులతో సమావేశమై భక్తుల రద్దీవల్ల ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేలా చర్యలు చేపట్టారు.


ఆచంటలో కార్తీక పౌర్ణమికి వెలిగించిన అఖండ జ్యోతి


దుర్గాలక్ష్మణేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం


లక్ష్మణేశ్వరం శివాలయంలో చలువ పందిళ్లు వేసిన దృశ్యం

క్లుప్తంగా

వైభవంగా నందీశ్వరుని కల్యాణం


సిద్ధాంతంలో నందీశ్వర స్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: సిద్ధాంతంలో శ్రీ పార్వతీ సమేత నందీశ్వర స్వామి శివరాత్రి మహోత్సవాల సందర్భంగా ఆదివారం రాత్రి స్వామి వారి కల్యాణం వేడుకగా నిర్వహించారు. ఆలయ అర్చకులు కాల్దరి సుబ్రహ్మణ్యం, వేద పండితులు దొంతుకుర్తి సత్యనారాయణ వేద మంత్రాలతో బడేటి గణేష్, శ్రీమతి సుబ్బలక్ష్మి దంపతులతో కల్యాణం జరిపించారు. ముందుగా స్వామివారికి అమ్మవారికి కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం గ్రామంలో స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పుష్పభాను ఏర్పాటును పర్యవేక్షించారు.

బాధితురాలికి వసుధ ఫౌండేషన్ వితరణ


రూ.10 వేల చెక్కును అందిస్తున్న పెన్మెత్స బుద్ధరాజు

పోడూరు: పాలకొల్లు పట్టణానికి చెందిన ఆర్.వెంకటరమణ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన వెంకటరామరాజు ఆమె గురించి తెలిసి ఫౌండేషన్ తరపున రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. ఫౌండేషన్ కన్వీనర్ బుద్ధరాజు సంబంధిత చెక్కును ఆదివారం బాధితురాలికి అందజేశారు.

ఉత్సాహంగా మెగా కల్చరల్ నైట్


మెగాకల్చరల్ నైట్‌లో మాంటీసోరీస్ సిబ్బంది

పోడూరు: ఉల్లంపర్రు మాంటీస్సోరీస్ స్థాపించి 35 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా వార్షికోత్సవాన్ని శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన నరసాపురం ఆర్డీఓ దాసిరాజు జ్యోతి ప్రజ్వలన చేశారు. ఒకే విద్యాసంస్థ నుంచి ఒకే వేదికపై 984 మంది విద్యార్థులతో 52 ప్రోగ్రామ్స్‌తో నిర్వహించిన మెగా కల్చరల్ నైట్ ఎంతో అలరించింది. ప్రముఖ మిమిక్రీ ఆర్టిస్ట్ రవి మిమిక్రీ ప్రేక్షకులను ఎంతో అలరించింది. ఈ కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు, ఎంఈఓ జి.వీరాస్వామి, స్కూల్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దాల రాంప్రసాద్, డైరెక్టర్ అండ్ అడ్మినిస్ట్రేటర్ మద్దాల వాసు, ప్రిన్సిపాల్ వసంత లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు నగర పంచాయతీ సర్వసభ్య సమావేశం

ఆకివీడు: స్థానిక నగర పంచాయతీ సర్వసభ్య సమావేశం ఈ నెల 24వ తేదీ సోమవారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ హాలులో నిర్వహిస్తామని ఛైర్‌పర్సన్ జామి హైమావతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో స్థానిక సమస్యలపై సమీక్ష, అజెండాలోని అంశాలపై చర్చిస్తారని తెలిపారు. కౌన్సిల్ సభ్యులు హాజరుకావాలని సూచించారు.

నేడు జోనల్ క్రీడా పోటీలు

ఆకివీడు: ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యం పెంపొందించేందుకు మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి ఎ.రవీంద్ర ఆదివారం చెప్పారు. మండలంలోని సిద్ధాపురం గ్రామంలోని దామోదరం సంజీవయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 24 నుంచి రెండు రోజుల పాటు నియోజకవర్గంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులు క్రీడా పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. గేమ్స్, అథ్లెటిక్స్ విభాగాల్లో పోటీలుంటాయన్నారు. పోటీల్లో గెలుపొందిన వారు జిల్లా స్థాయి పోటీల్లోనూ, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎంఈఓ తెలిపారు. క్రీడా పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, తమ క్రీడా ప్రతిభను కనబర్చాలన్నారు.

నేటి నుంచి శివరాత్రి మహోత్సవాలు


ఉండి: రాజులపేటలో ఉన్న పార్వతీ సమేత చెన్నమల్లేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 24వ తేదీ సోమవారం నుంచి 28వ తేదీ శుక్రవారం వరకు మహాశివరాత్రి, కల్యాణ మహోత్సవాలు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి రోజూ స్వామి వారికి ప్రత్యేక పూజలు, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 25వ తేదీన వైభవంగా స్వామివారి గ్రామోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు.అలాగే ప్రతి రోజూ పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

23ఎన్ఎస్‌పీ04: పి.విజయదుర్గ

నరసాపురం: పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారం కోసం వచ్చే నెల 8న జాతీయలోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్టు నరసాపురం పదో అదనపు జిల్లా జడ్జి పి.విజయదుర్గ చెప్పారు. కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదాలత్ ప్రాముఖ్యతపై కక్షిదారులకు అవగాహన కల్పించి వీలైనన్ని ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చూడాలని పోలీసుశాఖ, న్యాయవాదులకు విజ్ఞప్తి చేశారు. రాజీ చేసుకోదగిన క్రిమినల్, చెక్‌బౌన్స్, యాక్సిడెంట్ కేసులు పరిష్కారం చేస్తామని చెప్పారు.

దేవాంగ సేవా సంఘం ఇన్‌చార్జిగా చిట్టికాసులు


చిట్టికాసులు

పోడూరు: రాష్ట్ర దేవాంగ అభ్యుదయ సేవాసంఘం పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జిగా దిగమర్రు గ్రామానికి చెందిన కాలేపు చిట్టికాసులు నియామితులయ్యారు. ఈ మేరకు దేవాంగ సేవాసంఘం రాజకీయ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి అల్లాడ సూర్యభాస్కర్ ఆదివారం ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సూర్యభాస్కర్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం దేవాంగుల సంక్షేమం కోసం దేవాంగ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. త్వరలో దేవాంగ సంక్షేమ సంఘానికి నరసాపురం, ఉండి, భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, ఆచంట నియోజకవర్గాలకు కూడా ఇన్‌చార్జిలను నియమిస్తామని తెలిపారు.

పంపిణీ కాని ఓటరు స్లిప్పులు

ఉండి: నియోజకవర్గ కేంద్రం ఉండిలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు స్లిప్పుల పంపిణీ కాకపోవడంతో ఓటర్లు అయోమయానికి గురవుతున్నారు. ఆదివారం ఉండిలోని కూర్మావారి వీధిలోని ఓటర్లకు స్లిప్పులు పంపిణీ కాకపోగా స్లిప్పులు పంపిణీ చేసినట్లు ఫోన్ ద్వారా మెస్సేజ్‌లు రావడంతో వారంతా అవాక్కయ్యారు. ఉండిలోని బీఎల్‌వోలకు ఒక్కొరికీ 30 మంది చొప్పున ఓటరు స్లిప్పులు ఉండగా వాటిని ఇంత వరకు పంపిణీ చేయకపోగా పంపిణీ చేసినట్లు ఓటర్ల ఫోన్లకు మెస్సేజ్‌లు రావడంతో అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనగా కనబడుతుందని ఓటర్లు వాపోతున్నారు. ఇప్పటికే ఓటర్ల జాబితా తప్పుల తడకగా ఉందంటూ ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులు ఓటరు స్లిప్పులు కూడా పంపిణీ చేయకుండా చేసినట్లు చెప్తారా అని ఓటర్లు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని గ్రాడ్యుయేట్ ఓటర్లకు స్లిప్పులు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని ఓటర్లు కోరుతున్నారు.

పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ

పెనుగొండ: మండలంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఈఓపీఆర్డీ జి.నరసింహారావు తెలిపారు. ఆదివారం కొడమంచిలిలో తడి పొడి చెత్తపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో సచివాలయ సిబ్బంది టీములుగా ఏర్పడి ప్రజలకు తడి, పొడి చెత్తపై అవగాహన కలిపిస్తున్నారన్నారు. స్థానికులు తమ ఇంట్లో చెత్తను వేరువేరుగా సేకరించి ఇవ్వాలన్నారు. సేకరించని చెత్తను ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ వద్దకు తరలిస్తామన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే పారిశుద్ధ్యం మెరుగుపడాలన్నారు. దీనికి ప్రజలందరూ సహకరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎం.హనుమంతరావు, డిజిటల్ అసిస్టెంట్ ఎం.రవీంద్రబాబు, వెటర్నరీ అసిస్టెంట్ సురేందర్ రెడ్డి, అగ్రికల్చర్ అసిస్టెంట్ బాల సాయి నవీన్, జూనియర్ అసిస్టెంట్ బి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


కొడమంచిలిలో పారిశుద్ధ్య ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్న దృశ్యం

ప్రతి విద్యార్థీ ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

పాలకొల్లు సెంట్రల్: ప్రతి విద్యార్థీ తన విద్యార్థి దశలోనే ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు వెళ్లాలని పట్టణ వైద్యుడు ఎం.లక్ష్మీపతిరాజు అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎంఎంకేఎస్‌ఎం మునిసిపల్ హైస్కూల్లో విద్యా చైతన్య సమాఖ్య ఆధ్వర్యంలో ఏడు, తొమ్మిదో తరగతి విద్యార్థులకు ప్రతిభా పాటవ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీపతిరాజు మాట్లాడుతూ చిన్నతనం నుంచే ఒక ఆశయంతో చదవాలని ఆ ఆశయమే ఏదో ఒకరోజు మిమ్మల్ని ఉన్నత స్థాయికి తీసుకువెళుతుందని అన్నారు. చదువుతున్నంత సేపు ఇతర విషయాలను పట్టించుకోకుండా మీలో మీరే పోటీగా చదువుకోవాలన్నారు. చైతన్య సమాఖ్య కార్యదర్శి పోలిశెట్టి శ్రీశ్రీ మాట్లాడుతూ గత 12 సంవత్సరాలుగా ఈ ప్రతిభాపాటవ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పరీక్షకు పాలకొల్లు డివిజన్ పరిధిలో పాలకొల్లు పట్టణం, పాలకొల్లు, పోడూరు, ఆచంట,యలమంచిలి, వీరవాసరం మండలాలకు చెందిన విద్యార్థులు సుమారు 400 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పితాని ధర్మారావు, తోలేటి గాంధీ, జవ్వాది నాగేశ్వరరావు, మంచెం కనకరాజు, కింజరాపు దుర్గాప్రసాద్, కొంతేటి ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.


ప్రశ్నాపత్రాన్ని విడుదల చేస్తున్న లక్ష్మీపతిరాజు, సమాఖ్య సభ్యులు

ఘనంగా చంద్రయ్య వర్ధంతి

పాలకొల్లు సెంట్రల్: బ్రిటిష్ పాలకుల దోపిడీ, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా గిరిజన దళిత, బహుజన, పీడిత వర్గాల తరుపున పోరాటం చేసి ఆత్మార్పణకు గురైన పోరాట యోధుడు ద్వారబందాల చంద్రయ్య దొర పోరాటం ఎనలేనిదని ఎంబీసీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్, సంచార జాతుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పెండ్ర వీరన్న కొనియాడారు. ఆదివారం పట్టణంలో ఓ అతిథి గృహంలో శ్రీకృష్ణదేవరాయ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు యర్రంశెట్టి వెంకటరత్నం అధ్యక్షతన జరిగిన ద్వారబందాల చంద్రయ్య దొర 134వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెండ్ర వీరన్న మాట్లాడుతూ చంద్రయ్య సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వంగా నరసింహారావు, పెనుమాక రామ్మోహనరావు, కొల్లాటి పెద్దిరాజు, కొట్టి భాస్కరరావు, మాడభూషి కృష్ణప్రసాద్, ముచ్చర్ల శ్రీరామ్, గంధం కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.


ద్వారబందాల చంద్రయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సభ్యులు

మలుపులు.. ప్రమాదానికి పిలుపులు

- కానరాని సూచిక బోర్డులు
- తరచూ ప్రమాదాలు.. పట్టించుకోని అధికారులు

వీరవాసరం: రహదారిపై ప్రయాణించాలంటే ప్రయాణికులు, వాహన చోదకులు భయభ్రాంతులకు గురవుతున్నారు. దీనికి కారణం మండల కేంద్రమైన వీరవాసరం నుంచి బ్రాహ్మణ చెరువు వెళ్లే రహదారిలో పెద్ద పెద్ద మలుపులు ఉన్నాయి. వీరవాసరం మొదలుకుని రైల్వే గేట్ దాటాక పాత కలప వ్యాపార సమీపంలో ఒక మలుపు, తోకలపూడి దాటగానే గంధం వెంకటస్వామి నాయుడు చెరువుల వద్ద రెండు మలుపులు, ఉన్నాయి. తోలేరు చింత పెట్రోల్ బంకు సమీపంలో ఒక మలుపు, పంజా వేమవరంలో మరో మలుపు, బుధ రాయుడు చెరువు వద్ద రెండు మలుపులు, నవుడూరు జంక్షన్ సమీపంలో ఒక మలుపు, పాలమూరు సమీపంలో మరో మలుపు ఉన్నాయి. ఎదురుగా వచ్చే వాహనాలు కనపడక నిరంతరం పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రహదారికి ఏ ఒక్క ప్రాంతంలోనూ సూచిక బోర్డులు లేకపోవడంతో ప్రయాణికులు, వాహన చోదకులు వాపోతున్నారు. అడ్డదారిపై ఉన్న మలుపులు కావని ప్రమాదానికి తలుపులని ప్రజలంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు తక్షణమే స్పందించి రహదారి సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.


వీరవాసరం మండలంలో ప్రమాదకరంగా ఉన్న మలుపులు

పంచాయతీపై అసత్య ఆరోపణలు తగవు

పాలకోడేరు: మండలంలోని పెన్నాడ గ్రామ పంచాయతీలో ఎటువంటి అవినీతి జరలేదని, దీనిపై ఎటువంటి విచారణకైనా సిద్ధంగా ఉన్నట్లు సర్పంచ్ చిల్లా అనూష అన్నారు. స్థానిక సచివాలయం వద్ద ఆదివారం గ్రామస్తులు, పాలకవర్గ సభ్యుల ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అనూష మాట్లాడుతూ పంచాయతీలో కోట్లాది రూపాయలు అవకతవకలు జరిగాయని కొంతమంది అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదన్నారు. కొన్ని చానళ్లు కావాలనే బురద జల్లే ప్రయత్నం చేశారని ఇది సమంజసం కాదన్నారు. నిరంతరం గ్రామస్తులకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశామన్నారు. అటువంటిది తమపై, తమ పంచాయతీపై అవినీతి ఆరోపణలు చేయడం సరి కాదన్నారు. తమపై లేనిపోని ఆరోపణలు చేసిన వారిపై లీగల్‌గా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బ్రహ్మాజీ, శివ, విక్రమ్, మమత, కల్యాణి, ఏసు పాల్గొన్నారు.


పెన్నాడలో మాట్లాడుతున్న సర్పంచ్ చిల్లా అనూష, వార్డు సభ్యులు

హామీలు అమలు చేసి ఓటు అడగాలి


ఉండి: అధికారంలోకి రావడానికి చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ అభ్యర్థికి ఓట్లు వేయమని అడగాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి జీవీ సుందర్ అన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ఓట్లు అడిగే అర్హత చంద్రబాబుకు లేదన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉండిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇచ్చి ఓట్లు అడగాలన్నారు. స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు, రైతులకు ఏటా రూ.20 వేలు, 19 నుంచి 59 ఏళ్ల మహిళలకు నెలకు రూ.1500, ప్రతి మహిళకు ఉచిత బస్సు, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు 50 ఏళ్లకే పింఛన్, డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణం రూ.10 లక్షలు, బీసీలకు ఆదరణ, ప్రత్యేక చట్టంలో భాగంగా రూ.5 వేల కోట్లు, స్థానిక సంస్థల నామినేటెడ్ పదవుల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్, హజ్ యాత్రకు వెళ్లే ముస్లింలకు రూ.లక్ష ఆర్థిక సాయం, బ్యాడ్జ్ ఉన్న డ్రైవర్లకు ఏడాదికి రూ.15 వేలు, పూజారులకు ప్రతి ఏటా రూ.15 వేలు, చేనేత కుటుంబాలకు ఏడాదికి రూ.24 వేలు, రూ.25 లక్షల ఆరోగ్య బీమా, మత్స్యకార కుటుంబాలకు వేట విరామంలో రూ.20 వేలు, బీపీ, షుగర్ బాధితులకు ఉచిత మందులు, ఉచిత ఇసుక, ఎస్సీ పథకాల పునరుద్ధరణ, మెడికల్ కళాశాలల్లో అడ్మిషన్ విధానంలో పాత పద్ధతిని అమలు చేయడం వంటివి నెరవేర్చిన తరువాత చంద్రబాబు గాని కూటమి నాయకులు గాని తమ అభ్యర్థికి ఓట్లు వేయమని అడగాలని కోరారు. గ్రూప్–2 అభ్యర్థుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య, నిరంకుశ వైఖరిని ఎండగడుతూ గ్రాడ్యుయేట్స్ అందరూ ఓటుతో తగిన బుద్ధి చెప్పాలని కోరారు. అన్యాయం జరిగిందని ఉద్యమాలు, ధర్నాలు చేయడం కంటే ఓటుతోనే తమ సత్తా ఏమిటో చూపించాలన్నారు.


పత్రికా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి సుందర్

జీఓ ప్రకారమే మద్యం ధరలు

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీఓ ప్రకారమే మద్యం విక్రయాలు జరుగుతున్నాయని పట్టణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ మద్దాల శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 10న రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీఓ ప్రకారమే మద్యం బాటిల్ ఎంఆర్‌పీ ధర రూ.10 పెరిగిందని, అంతే తప్ప అదనంగా రూ.10 పెంచలేదని పేర్కొన్నారు.

సూర్య భగవానుడికి ప్రత్యేక పూజలు


సూర్యాలయం వీధిలో క్యూకట్టిన భక్తులు

తణుకు అర్బన్: మాఘ మాసం ఆఖరి ఆదివారం సందర్భంగా తణుకు సూర్యదేవాలయానికి భక్తులు పోటెత్తారు. సూర్యనారాయణస్వామికి ఆదివారం ప్రీతికరమైన రోజుకావడం, మాఘమాసం కావడంతో స్వామిని రకరకాల పుష్పాలు, తులసీ దళాలతో ప్రత్యేకంగా అలంకరించారు. దినకరుడిని ఆరోగ్యదాతగా కొలిచే భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలిరావడంతో సూర్యాలయం వీధి పొడవునా భారీ క్యూకట్టారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్ఛరణలతో పూజాధికాలు నిర్వహించారు.

వార్డుల్లో సమస్యలతో సతమతం

- అధ్వానంగా డ్రెయిన్లు
- మంచినీటికీ కటకటే
- పట్టించుకోని అధికారులు

నరసాపురం: పట్టణంలో పలు వార్డుల్లోని ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారు. ముఖ్యంగా పట్టణంలోని 2,3 వార్డులు అయిన పొన్నపల్లి, మాధవాయిపాలెం ప్రాంతాల్లో కనీస వసతులు లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ వార్డుల్లో పూడుకుపోయిన డ్రెయిన్లు కంపుకొడుతున్నాయి. కుళాయిల నుంచి మంచినీళ్లు రాక ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఆయా వార్డుల్లో పారిశుద్ధ్యం పడకేసింది. రోడ్లపై ఎక్కడికక్కడే చెత్త పేరుకుపోతుంది. పట్టించుకోవాల్సిన అధికారులు ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు ప్రాతినిధ్యం వహిస్తుండడంతో ప్రభుత్వం మారిన తరువాత విపక్ష వార్డుల్లో సౌకర్యాలపై అధికార కూటమి సర్కారు వివక్ష చూపిస్తున్న కారణంగా ఈ పరిస్థితి తలెత్తిందనే విమర్శలు వస్తున్నాయి. కూటమి నాయకుల తీరుతో స్థానికులు అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. పట్టణంలో బస్టాండ్ వెనుక ఉన్న ప్రధాన ప్రాంతం 2వ వార్డు. వెనుకనే గోదావరిని ఆనుకుని 3వవార్డు ఉంది. అయితే ఇక్కడి సమస్యలపై మాత్రం ఎవరూ దృష్టి పెట్టడంలేదు. రెండు వార్డుల్లో 7 వేల జనాభా ఉంది. ఎస్సీ,బీసీ వార్గాల వారు ఎక్కువగా జీవిస్తున్నారు. ముఖ్యంగా పేదలు అధికంగా నివసించే ప్రాంతమైనా వార్డులో ఎక్కడా సరైన డ్రెయిన్స్ లేవు. ఒకవేళ ఉన్నా డ్రెయిన్స్ మురుగు పారక తీవ్ర దుర్గధం వెదజల్లుతున్నాయి.


పొన్నపల్లిలో రోడ్డుపైనే ఉన్న చెత్త


మాధవాయిపాలెంలో ఇళ్ల మధ్య డ్రెయిన్‌లో పొంగుతున్న మురుగునీరు

మంచినీటికీ తప్పని ఇబ్బందులు

కుళాయి చెరువు పక్కనే ఈ ప్రాంతం ఉంది. అయితే మంచినీటికి ఈ ప్రాంతంలో స్థానికులు కటకటలాడాల్సిన పరిస్థితి. మురుగు డ్రెయిన్స్ పక్కన పబ్లిక్ కుళాయిలు ఉన్నాయి. ఆ మురుగునీరుతో తాగునీరు కలుషితం అవుతుంది. ఇక లీకేజీల తంటా కారణంగా తక్కువ ప్రెజర్‌తో నీటిని వదులుతారు. దీంతో ఈ ప్రాంతాల్లో కుళాయిల నుంచి సమృద్ధిగా నీరందని పరిస్థితి నెలకొంది. వేసవి సమీపించిన దృష్ట్యా మంచినీటికి ఇంకా ఎన్ని ఇబ్బందులు పడాలో? అని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా పాలకులతో పాటు అధికారులు సమస్యలపై దృష్టి పెట్టాలని పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్యలుంటే పరిష్కరిస్తాం



పొన్నపల్లి, మాదవాయిపాలెం ప్రాంతాల్లో పారిశుద్ధ్యం మెరుగుదలకు చర్యలు చేపడుతున్నాం. సమస్యలుంటే మా దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తాం. కొత్త డ్రెయిన్స్ నిర్మాణం అంటే అది పాలకవర్గం నిర్ణయం తీసుకుని చేయాలి. మురుగు డ్రెయిన్స్‌ను తరచూ శుభ్రం చేయాలని అధికారులను అప్రమత్తం చేస్తున్నాము. మంచినీటి సమస్యలపై దృష్టి పెడతాం.

– ఎం.అంజయ్య, మున్సిపల్ కమిషనర్